క్లుప్తంగా

విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం



వధూవరుల అలంకరణలో విశ్వేశ్వర స్వామి, అన్నపూర్ణ అమ్మవార్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పవర్‌పేటలోని కాశీ అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలు గురువారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 22వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉత్సవాల తొలిరోజున ఉదయం 9 గంటలకు స్వామి వారిని, అమ్మవారిని పెండ్లి కుమారుని, పెండ్లికుమార్తెలుగా అలంకరించారు. సాయంత్రం 6.30 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, అఖండ దీపారాధన, వాస్తు పూజ చేశారు. అనంతరం ధ్వజారోహణ, నిత్యహోమాలు, బలిహరణ పూజలు నిర్వహించారు. స్వామి వారికి, అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు కందుకూరి రామ బ్రహ్మానంద శర్మ విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి ఎం రామాంజనేయులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ

ఏలూరు టౌన్: మేనల్లుడి శుభకార్యానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు అభరణాలు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు వన్‌టౌన్ సత్యనారాయణ పేటకు చెందిన మత్తి శ్రీనుబాబు తన మేనల్లుడి పుట్టిన రోజు వేడుకకు ఈనెల 18న ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా నరసాపురం వెళ్లాడు. తిరిగి గురువారం ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపు తాళాలు పగలకొట్టి ఉన్నాయి. దొంగలు లోనికి చొరబడి కొన్ని బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి దోచుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడు ఆశ్రంలో యోగ కార్యక్రమం

ఏలూరు రూరల్ : ప్రపంచ యోగ డే సందర్భంగా శుక్రవారం ఏలూరు ఆశ్రం వైద్య కళాశాల ఆవరణలో యోగా డే నిర్వహించనున్నట్లు ఆశ్రం యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 6 గంటలకు యోగా హాల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఆశ్రం చైర్మన్ గోకరాజు గంగరాజు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని పేర్కొంది. యోగ సాధన వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు వ్యక్తిగత, సమాజానికి జరిగే మేలును పలువురు యోగా సాధకులు వివరించనున్నట్టు తెలిపింది.

యువత ఉపాధికి భరోసా కంప్యూటర్ విద్య

- ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, సెట్‌వెల్ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ
- నాలుగేళ్లలో 29 బ్యాచ్‌లు, 485 మందికి వివిధ కోర్సుల్లో శిక్షణ





విద్యార్థులకు కంప్యూటర్ విద్యలో మెలకువలు నేర్పుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మి, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ పొందుతున్న యువతీ, యువకులు

ఏలూరు (టూటౌన్) : నేడు సాధారణ విద్యతో పాటు కంప్యూటర్ విద్య యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో కీలకంగా మారింది. దీనిని గుర్తించిన ఏలూరు పవరుపేటలోని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం పేద, మధ్యతరగతి యువతీ, యువకులకు కంప్యూటర్‌లో శిక్షణ ఇస్తూ.. వారి ఉపాధికి తోడ్పాటు అందిస్తోంది. స్థానిక పవరుపేటలోని అన్నే అనసూయ, వెంకటేశ్వరరావు విజ్ఞాన కేంద్రంతో పాటు సెట్‌వెల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాన్ని 2020 మే 27న ప్రారంభించారు. ఇప్పటి వరకు 29 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారు. 485 మంది వివిధ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరిలో కొందరు శిక్షణ కేంద్రం కమిటీ సిఫార్సుల మేరకు స్థానికంగా ఉపాధి అవకాశాలు పొందారు.

కంప్యూటర్ కోర్సులు

- ఎమ్మెస్ ఆఫీసు, డీటీపీ, ఫొటోషాప్, టాలీ, కంప్యూటర్ బేసిక్స్
- కంప్యూటర్ కోర్సులతో పాటు సమకాలీన సైన్సు పరిశోధనలు, సామాజిక అంశాలు, మహనీయులకు సంబంధించిన విషయాలపైనా అవగాహన కల్పిస్తున్నారు.

12 ఏళ్లు పైబడిన వారందరికీ అవకాశం

కంప్యూటర్ శిక్షణకు 12 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ అర్హులే. ఈ కేంద్రంలో ఏరోజైనా జాయినై శిక్షణ పొందవచ్చు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు శిక్షణ ఉంటుంది. ప్రతి రోజూ గంట చొప్పున థియరీ, ప్రాక్టికల్స్ ఉంటాయి.

సర్టిఫికెట్ల అందజేత

ఏవీఆర్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో దాతల ద్వారా సమకూర్చిన 10 కంప్యూటర్లతో శిక్షణ ఇస్తున్నారు. ఈ కేంద్రం కృషిని గుర్తించిన సెట్‌వెల్ జిల్లా అధికారి ఎం డీఎం మెహర్‌రాజు శిక్షణ పొందిన వారికి అందించే సర్టిఫికెట్లకు సెట్‌వెల్ గుర్తింపును జత చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి నిర్వాహకులు ఏలూరు ప్రముఖుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేస్తున్నారు.

ఉద్యోగం సంపాదించా



నాకు కంప్యూటర్ ఉద్యోగం అంటే ఇష్టం. కంప్యూటర్ శిక్షణా కేంద్రంలో ఎంఎస్ ఆఫీస్, టాలీలో శిక్షణ పొందాను. ఎంఎస్ఎన్ మార్కెటింగ్‌లో ఉద్యోగం లభించింది. నా కల నెరవేరడంలో ఏవీఆర్ కంప్యూటర్ శిక్షణ కేంద్రం సహాయపడింది. ప్రస్తుతం ఉద్యోగంలో నేను చాలా సంతోషంగా ఉన్నాను.

– ఎస్.వెన్నెల, ఏలూరు

శిక్షణ బాగుంది



నేను, నా స్నేహితులు అఖిల్, సుకుమార్‌లతో కలిసి ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, ఫొటోషాప్ కోర్సుల్లో శిక్షణ పొందాం. నా కాళ్లపై నేను నిలబడగలననే ఆత్మ విశ్వాసం ఏర్పడింది. శిక్షణా కేంద్రంలో ఫ్యాకల్టీ, కమిటీ పెద్దలు మా పట్ల ఎంతో బాధ్యత తీసుకొని శిక్షణ ఇచ్చారు.

– కె.త్రినాథ్, ఏలూరు

సంతోషంగా ఉంది



12 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల వయసు ఉన్న వారికి వివిధ కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం సంతోషంగా ఉంది. ఇదొక సామాజిక బాధ్యత. కేవలం రూ.500 అడ్మిషన్ ఫీజుతో ఒక కోర్సులో నెలరోజుల పాటు శిక్షణ ఇస్తున్నాం. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో కొందరికి ఉపాధి అవకాశాలు ఇవ్వగలుగుతున్నాం. ఈ శిక్షణ కేంద్రం ద్వారా విద్యార్థులతో పాటు గృహిణులు, ఉద్యోగులు తమ కంప్యూటర్ నైపుణ్యాన్ని పెంపొందించుకోగలుగుతున్నారు.

– ఎంఎస్ఎన్ లక్ష్మి, ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ, ఏవీఆర్ కంప్యూటర్ శిక్షణా కేంద్రం

దాతల సహకారంతో నిర్వహణ



ఏలూరు పవరుపేటలోని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహణకు దాతలు సహకరిస్తున్నారు. కంప్యూటర్లు, ఇతర సౌకర్యాలు, వసతులన్నీ దాతల ద్వారానే సమకూర్చుకొంటున్నాం. ప్రతినెలా నిర్వహణకు బొమ్మలూరుకు చెందిన దీపక్ నెక్స్ జెన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఆలపాటి నాగేశ్వరరావులు సహకరిస్తున్నారు. కుల, మత భేదాలకు తావులేకుండా ఆసక్తి గల ప్రతి ఒక్కరికీ శిక్షణ ఇస్తున్నాం.

– గుడిపాటి నరసింహారావు, కార్యదర్శి, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు మండలంలోని అరుంధతి పేట విద్యుత్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతు నిమిత్తం ఈ నెల 21వ తేదీన నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పవర్‌పేట సెక్షన్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని వడ్డిగూడెం, పాలతూము సెంటర్, అరుంధతి పేట, శనగ పప్పు బజారు, దొంగల మండపం సెంటర్, పడమర వీధి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంతం, లోయదిబ్బ, పడమర వీధి, కచేరి చావిడి, చిరంజీవి బస్టాండు, జ్వాలా పహరేశ్వర కాలనీ, దక్షిణపు వీధి, పోణంగి రోడ్డు, అశోక చక్రం రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

మహిళపై కేసు

ఏలూరు టౌన్: చట్ట విరుద్ధంగా ఓ బిడ్డను దత్తత తీసుకున్న మహిళపై త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. నగర శివారు వట్లూరుకు చెందిన సాయి భవానీ ప్రసన్నకు పిల్లలు లేకపోవటంతో గుంటూరుకు చెందిన ఓ మహిళ వద్ద 13 నెలల క్రితం రూ.20 వేలు ఇచ్చి బిడ్డను కొనుగోలు చేసింది. ఆ బిడ్డకు సతీష్ అనే పేరు పెట్టి పెంచుకుంటోంది. ఈ క్రమంలో వట్లూరుకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తకు విషయం తెలియటంతో శిశుసంరక్షణ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసింది. చైల్డ్ లైన్ సిబ్బంది గురువారం ఆ బిడ్డను స్వాధీనం చేసుకుని శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. చైల్డ్ వెల్ఫేర్ శాఖ అధికారి జాహ్నవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు గురువారం సాయి భవానీ ప్రసన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన వృద్ధురాలు మోటారు సైకిల్ ఎక్కుతూ జారిపడడంతో తలకు తీవ్ర గాయమైంది. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు వివరాల ప్రకారం.. స్థానిక బావిశెట్టివారిపేటకు చెందిన వీర్నాల కనకమ్మ (67) ఈనెల 18 సాయంత్రం తన చిన్నకొడుకు ద్విచక్ర వాహనంపై పచారీ దుకాణానికి వెళ్లింది. తిరిగి వచ్చే క్రమంలో ద్విచక్ర వాహనం ఎక్కుతూ జారి కిందపడింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్రగాయం కాగా కుటుంబ సభ్యులు సర్వజన ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించటంతో కనకమ్మ గురువారం రాత్రి మృతిచెందింది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు గురువారం రూ. 1,01,116 విరాళంగా అందజేశారు. విజయవాడకు చెందిన కుదరవల్లి వెంకటకృష్ణమూర్తి ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

కంప్యూటర్, టైలరింగ్ శిక్షణ

దెందులూరు: గ్రామ శివారు ప్రాంతాల్లో మహిళలకు, బాలికలకు స్వయం ఉపాధి, వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యత కల్పించడం సెయింట్ ఫ్రాన్సిస్ ట్రైనింగ్ సెంటర్ లక్ష్యమని బ్రదర్ జోసెఫ్‌కుమార్ అన్నారు. గురువారం గోపన్నపాలెం సెయింట్ ఫ్రాన్సిస్ ట్రైనింగ్ సెంటరులో టైలరింగ్, కంప్యూటర్ డిజిటల్ ఫొటోషాప్‌పై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. బాలికలు, మహిళలు రూ.800 ప్రవేశరుసుము చెల్లించి ఈ రెండు నెలల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బ్రదర్ జోసెఫ్‌కుమార్ కోరారు.

చుట్టల కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలి



సమావేశంలో పాల్గొన్న మహిళా కార్మికులు



మాట్లాడుతున్న ఇఫ్టూ ప్రధాన కార్యదర్శి వెంకట్రావు

ఏలూరు (టూటౌన్): చుట్టల కార్మికులను రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ అనుబంధ చుట్టల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక చొడిదిబ్బ పెద్ద రామాలయం వీధిలో ఉన్న కమ్యూనిటీ హాలులో జనరల్ బాడీ సమావేశం వి.చంటి అధ్యక్షతన నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఐఎఫ్‌టీయూ నగర నాయకులు గడశాల రాంబాబు, మంగం అప్పారావు మాట్లాడారు. నగరంలో వందలాదిగా పనిచేస్తున్న చుట్టల కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రెండేళ్లకోసారి జరిగే వేతన ఒప్పందం విషయంలో టుబాకో మర్చంట్స్ మ్యానిఫ్రాక్చర్స్ అసోసియేషన్ చొరవ తీసుకుని కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేయాలని కోరారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతన ఒప్పందం చేయాలన్నారు. కూలీ రేట్లు పెంపుదల కోరుతూ ఈ నెల 25న యజమానులకు వినతి పత్రం అందజేయాలని జనరల్ బాడీ తీర్మానించింది. సమావేశంలో ఎం.లక్ష్మి, కృష్ణవేణి, మహాలక్ష్మి, హైమావతి, వెంకటలక్ష్మి, సూరిబాబు, బాలయ్య తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	43
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	26
ఏలూరు - బీహెచ్ఈఎల్	21,.15	4822	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	31
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	32
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	29
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	--
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.10	98503	--
ఏలూరు - తిరుపతి	16.00	4830	24

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	68-74	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	48	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	64	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	64	ములక్కాడలు	07, 10
బెండకాయలు	52	కంద	64
పచ్చిమిర్చి	56	బీట్‌రూట్	38
కాకర కాయలు	60	కీరా దోస	50
బీరకాయలు	54	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	68	అల్లం	180
క్యాబేజీ	38	కొత్తిమీర (కట్ట)	20-40
క్యారెట్	40-56	పాలకూర	12
దొండకాయలు	40	చుక్కకూర	12
బంగాళదుంపలు	36	తోటకూర	12
ఉల్లిపాయలు	38	గోంగూర	07
గోరుచిక్కుడు	--	పుదీనా	05
దోసకాయలు	40	బఠాణీ	--
అనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	--
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	60

వానాకాలం.. జ్వరాలతో జాగ్రత్త!

ఏలూరు టౌన్ : దోమ.. పేరు చిన్నదే. కాని, దాని కాటుతో ఏటా వందలాది మరణాలు సంభవిస్తున్నాయి. ఆడదోమ కుట్టి మలేరియా వ్యాధి కారణమై ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టిస్తోంది. వర్షాకాలం కావడంతో నీరు నిల్వ ఉండి, విపరీతంగా దోమలు వృద్ధి చెందుతాయి. వర్షపునీరు నిలిచి మురుగుకూపాలు తయారై దోమలకు ఆవాసంగా మారతాయి. ఏలూరులో ఇటీవల కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో నీరు నిలిచి పారిశుధ్యం అధ్వానంగా మారింది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు డెంగీ, మలేరియా వంటి వ్యాధుల ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దోమకాటు వ్యాధులు

మలేరియా : ఆడఅనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాధి సోకుతుంది. మలేరియాతో బాధపడుతున్న రోగిని దోమ కుట్టడం వల్ల, దాని కడుపులోకి వ్యాధికారక పరాన్నజీవి ప్రవేశించి అక్కడ పెరుగుతుంది. ఇదే దోమ మరో వ్యక్తిని కుట్టినప్పుడు ఆ వ్యక్తి రక్తంలోకి చేరి మలేరియాకు కారణమవుతుంది. చలి, వణుకుతో జ్వరం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, జ్వరం వస్తూ పోతూ ఉంటుంది.

డెంగీ : పగటి సమయంలో కుట్టే ఏడీస్ ఈజిప్ట ఆడదోమ ద్వారా డెంగీ వ్యాధి సంక్రమిస్తుంది. ఇది సాధారణ వైరస్ జ్వరం, కండరాలు, కీళ్లనొప్పులతో జ్వరం మొదలవుతుంది. ప్లేట్‌లెట్లు అమాంతంగా తగ్గిపోయి హఠాత్తుగా తీవ్ర జ్వరం రావడం, కదలలేని స్థితి, ఎముకలు, కండరాలు భరించలేని నొప్పి, శరీరంపై ఎర్రని దద్దర్లు, వాంతులు, వికారం, నోరు ఎండటంతో పాటు చిగుళ్లు, ముక్కు నుండి రక్తం వస్తుంది.



ఆర్ఆర్‌పేటలో డ్రెయినేజీ నుంచి రోడ్డుపైకి వచ్చిన మురుగునీరు



పత్తేబాదలోని డ్రెయినేజీలో నిలిచిన మురుగు

మెదడువాపు : క్యూలెక్స్ ఆడదోమ కుట్టడం వల్ల మెదడువాపు వ్యాధి సంక్రమిస్తుంది. జపనీస్ ఎన్సెఫలైటీస్ వైరస్ ద్వారా వ్యాప్తిస్తుంది. ఎక్కువగా 2 నుంచి 14 ఏళ్లలోపు పిల్లల్లో ఈ వ్యాధి వస్తుంది. ఆకస్మికంగా జ్వరం వచ్చి తీవ్రత ఎక్కువగా ఉండడం, విపరీతమైన తలనొప్పి, వాంతులు, ఆపస్మారక స్థితికి లోనుకావడం, శరీరంలో ఏదో ఒక పక్క పక్షవాతానికి గురికావడం, ఫిట్స్ రావడం.

చికున్‌గున్యా : ఎడిస్ దోమల వల్ల ఈ వ్యాధి వస్తుంది. చేతులు, కాళ్లలో, కీళ్లలో వాపు వచ్చి కనీసం అడుగు తీసి అడుగు వేయలేని స్థితి ఏర్పడుతుంది. జ్వరంతో మనిషి బలహీనంగా తయారవుతాడు. తలనొప్పి, వాంతులు, వికారంతో పాటు హఠాత్తుగా జ్వరం, కీళ్ల నొప్పులు, సరిగా నిలబడలేకపోవడం.

ఫైలేరియా : దీనిని బోధకాలు అంటారు. క్యూలెక్స్ దోమ ద్వారా ఈ వ్యాధి వస్తుంది. శరీరంలోని ఏ భాగానికైనా బోధకాలు సోకుతుంది. తరుచూ జ్వరం, చంకల్లో, గజ్జల్లో బిళ్లలు కట్టడం, అవయవాల వాపు, చేతులు స్థనాలు, వరిబీజం జ్ఞానేంద్రీయాలు పాడవుతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. నిల్వ ఉన్న గుంతలలో క్రిమిసంహారక మందులు, కిరోసిన్ లేదా వాడిన ఇంజినాయిల్లో ముంచిన గుడ్డలు వేయాలి. మురుగునీరు బయటకెళ్లిపోయే విధంగా చర్యలు తీసుకోవాలి. నీటి ట్యాంకులు, డ్రమ్ములపై మూతలు సరిగ్గా ఉంచాలి. ఇంట్లో, ఇంటి చుట్టూ పనికిరాని కూలర్లు, పాతటైర్లు, డ్రమ్ములు, వాడని రోళ్లు, కొబ్బరిచిప్పలు, పగిలిన కుండీలు, సీసాలు లేకుండా చూసుకోవాలి. కిటికీలకు, డోర్లకు జాలీలు బిగించాలి, వ్యక్తిగత రక్షణకు దోమతెరలు కాయిల్స్ వాడాలి. శరీరాన్ని కప్పి ఉంచే దుస్తులు ధరించాలి.

నివారణ చర్యలు తీసుకున్నాం



ఏలూరు నగరంలోని డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేపట్టాం. పగలు, రాత్రి ఫాగింగ్ చేస్తున్నాం. 20 మంది బృందంతో పిచికారీ చేయిస్తున్నాం. యాంటీ లార్వా ఆపరేషన్‌లో భాగంగా నీటి నిల్వలున్న ప్రాంతాల్లో గంబూషియా చేపలు వదులుతున్నాం. ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో మురుగునీటి గుంతలు, ఖాళీ కొబ్బరి బొండాం చిప్పలు, చెత్తా, చెదారాలు, పిచ్చిమొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి.

– సంక్రాంతి వెంకటకృష్ణ, నగర కమిషనర్

ప్రజల సహకారంతోనే సంపూర్ణ పారిశుధ్యం

దెందులూరు: గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులు వేగంగా జరుగుతున్నాయని గ్రామ సర్పంచ్ ఇంటేటి మధులత, గ్రామ కార్యదర్శి రంగనాయకమ్మ అన్నారు. గురువారం గ్రామంలోని శ్రీనివాసరావుపేట ఇతర ప్రాంతాల్లో చెత్త తొలగించడం, డ్రెయిన్లు శుభ్రం చేయడం, బ్లీచింగ్ చల్లించడం వంటి పనులను పారిశుధ్య సిబ్బంది నిర్వహించారు. గ్రామంలో వ్యక్తిగత, సామూహిక పరిశుభ్రత ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఒక్కరూ ఇళ్లు, షాపుల వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకుని ఉపయోగించాలని గ్రామ కార్యదర్శి రంగనాయకమ్మ కోరారు.

కళాశాల సమస్యలపై వినతి

దెందులూరు: గోపన్నపాలెం వ్యాయామ కళాశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్ సత్తానియేలు, అధ్యాపకులు, విద్యార్థులు కోరారు. గురువారం టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్‌ను కలిసి కళాశాల సమస్యలపై విన్నవించారు. బాలికలు, బాలుర హాస్టల్‌ను, కోర్టును, గ్రౌండ్‌లు, ప్రహరీ, అంతర్గత రోడ్డు నిర్మాణం, టాయిలెట్స్, విద్యుత్ లైట్లు, జిమ్ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కోళ్ల వ్యర్థాలను వినియోగిస్తే అనుమతులు రద్దు

భీమడోలు: ఆక్వా చెరువుల యాజమానులు కోళ్ల వ్యర్థాలను మేతగా వినియోగిస్తే వాటి అనుమతులు రద్దు చేస్తామని తహసీల్దార్ జి.వర హలయ్య అన్నారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఇటీవల కోల్లేరు, ఇతర ప్రాంతాల్లోని చేపల సాగుకు యథేచ్ఛగాగా కోళ్ల వ్యర్థాలను ఆక్వా రైతులు వినియోగిస్తున్న నేపథ్యంలో మండల స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ జి.వరహాలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి లు ఎస్సై వై.సుధాకర్, రెవెన్యూ, ఆటవీ, మత్స్యాశాఖ అధికారులు హాజరయ్యారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను, ఆగడాలలంక, అంబర్‌పేట తదితర రెవెన్యూ గ్రామాల్లో ఆక్వా రైతాంగం కోళ్ల వ్యర్థాలను వినియోగించడంపై సమావేశంలో వివిధ శాఖల అధికారులు చర్చించి పలు అంశాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను తరలించే వాహనాలను సీజ్ చేయడంతో పాటు చెరువుల అనుమతులను రద్దు చేస్తామని హెచ్చరించారు. వ్యర్థాలను చేపలకు మేతగా వాడడం వల్ల పర్యావరణానికి పెనుముప్పుగా మారుతుందని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడడమేనన్నారు. కోళ్ల వ్యర్థాలను వినియోగిస్తే పక్కనే ఇతర సాగుకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. ఆక్వా రైతులు తమ అనుమతుల మేరకు సాగు చేయాలే తప్ప నిబంధలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లోని వీఆర్వోలు, పోలీసులు, ఇతర శాఖాల నిఘా పెట్టాలని, ఎంతటి వారిపైనే కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో కోళ్ల మాంస విక్రయ వ్యాపారులకు నోటీసులు జారీ చేసామని పేర్కొన్నారు. అనంతరం భీమడోలు పంచాయతీ శివారు లింగంపాడు ఏరియాలో ఆక్వా చెరువులను పరిశీలించారు. రైతులకు తగు సూచనలందించారు. మత్స్యాశాఖాధికారి ఎన్.దుర్గాదేవి, డీటీ షంషాద్దీన్, ఆర్ఐ కిరణకుమారి, అటవీశాఖ ఏబీఓ శ్రీనువాస్‌బాబు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఏలూరు

99122 20559

95055 08399

79955 66352

Office mail : tpgadvt@gmail.com